సాక్షి
విజయనగరం
సోమవారం । 24 । ఏప్రిల్ । 2023



వ్యాధుల అంతమే లక్ష్యం

పోలియో వ్యాధిని తరిమివేసినట్టే ప్రాణంతకమైన మీజిల్స్, రూబెల్లా వ్యాధులను కూడా తరిమివేయడానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

- 8లో



గుర్తుపట్టిందని..ప్రాణం తీశాడు

ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడాలనే ఉద్దేశంతో చెడు మార్గాన్ని ఎంచుకుని, చివరకు సొంత పెద్దమ్మనే హత్య చేశాడో ప్రబుద్ధుడు.

- 8లో



పుస్తక పఠనమే జ్ఞానార్జనకు మార్గం

జ్ఞానార్జనకు పుస్తక పఠనమే ప్రధాన మార్గమని దాన్ని యువత వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎన్.లలిత అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయతీగా రామభద్రపురం



రామభద్రపురం మేజర్ పంచాయతీ కార్యాలయం

రామభద్రపురం: రాష్ట్ర స్థాయి ఉత్తమ పంచాయతీగా రామభద్రపురం మేజర్ పంచాయతీ ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో 2021 – 22 ఆర్థిక సంవత్సరంలో సామాజిక భద్రత కలిగిన గ్రామ పంచాయతీగా ఎంపికైంది. పేదరికం, మెరుగైన జీవనోపాధుల విభాగంలో మండల స్థాయిలో రొంపల్లి ఉత్తమ పంచాయతీగా ఎంపికైనట్టు ఎంపీడీఓ రమామణి తెలిపారు. జాతీయ పంచాయతీ దినోత్సవం సందర్భంగా విజయవాడలో రామభద్రపురం పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు అమరావతిలో, రొంపల్లి పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం అవార్డులు అందుకోనున్నట్లు తెలిపారు.

ప్రశాంతంగా గురుకులాల ప్రవేశ పరీక్ష



మద్దువలస గురుకుల పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాల/కళాశాలల్లో ఐదవ తరగతి/ఇంటర్‌లో ప్రవేశానికి సంబంధించి ఆదివారం ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఐదవ తరగతికి సంబంధించి 1040 సీట్లకుగాను 2602 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 498మంది గైర్హాజరయ్యారు. 2104 మంది హాజరయ్యారు. అలాగే ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి సంబంధించి 1040 సీట్లకుగాను 1868 మంది దరఖాస్తు చేసుకున్నారు. 1480 మంది పరీక్షకు హాజరు కాగా, 388 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పలు పరీక్ష కేంద్రాలను జిల్లా సమన్వయకర్త బి.చంద్రావతి తనిఖీ చేశారు.

ఖాళీగా ఉన్న ఓఎస్ పోస్టులను భర్తీ చేయాలి

- నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ

విజయనగరం అర్బన్: జిల్లాలో ఖాళీగా ఉన్న ఆఫీస్ సబార్డునేట్ పోస్టులను భర్తీ చేయాలని ఆల్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. స్థానిక సంఘం భవనంలో జిల్లా కమిటీ ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు సభ్యులు పలు తీర్మానాలు చేశారు. ఉద్యోగులకు ఇవ్వాల్సిన డీఏ బకాయిలు, 12వ పీఆర్‌సీ తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, బీసీ, డీఆర్‌డీఏ శాఖల్లో పని చేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 వంవత్సరాలకు పెంచాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు ఎం.గంగాప్రసాద్ అధ్యతన జరిగిన సమావేశంలో పట్టణ అధ్యక్షుడు ఎం.మంగరాజు, జిల్లా సహాధ్యక్షుడు చందక శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి పి.రామలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.శ్రీను, సహాయక కార్యదర్శి బి.పైడితల్లమ్మ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కె.సూరిబాబు పాల్గొన్నారు.

అందరూ ఆదరించేలా 'ఆనందతీరం'



కాళికాదేవి అమ్మవారికి స్క్రిప్ట్ సమర్పించి పూజలు చేస్తున్న దర్శకుడు రాంబాబు

విజయనగరం టౌన్: ప్రతి ఒక్కరూ ఆదరించే విధంగా తమ చిత్రం ఆనందతీరం ఉంటుందని విజయనగరం జిల్లా పినవేమలికి చెందిన ఔత్సాహిక దర్శకుడు బీటెక్ రాంబాబు పేర్కొన్నారు. స్థానిక దాసన్నపేట కాళికాదేవి ఆలయంలో తమ నూతన సినిమా స్క్రిప్టును అమ్మవారికి సమర్పించి తొలి పూజలు ఆదివారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా సినీ రంగంలో వివిధ విభాగాల్లో అనుభవం సంపాదించి స్వయంగా తెలుగు సినిమాకు దర్శకత్వం వహించే అవకాశం కలిగిందని ఆనందం వ్యక్తం చేశారు. లక్ష్మీ బ్యానర్‌పై జాన్ రమేష్ హీరోగా, కన్నడ హీరోయిన్ శాంతిక హీరోయిన్‌గా నటిస్తున్నారన్నారు. ఉత్తరాంధ్ర పరిసర ప్రాంతాలతో పాటూ కేరళలో షూటింగ్ ఉంటుందన్నారు. నిర్మాతగా కాపుశైలజ వ్యవహరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో క్యారెక్టర్ ఆర్టిస్ట్ సన్యాసిరావు, లక్ష్మి, ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

సీహెచ్‌సీల్లో సేవలు భేష్

- గతంలో కంటే పెరిగిన ఓపీ, ఐపీ, శస్త్రచికిత్సలు
- జిల్లాలో 12 సీహెచ్‌సీలు
- 2021 – 22లో అందించిన ఓపీ సేవలు 8,31,016
- 2022 – 23లో అందించిన ఓపీ సేవలు 10,37,210
- గత ఏడాది కంటే పెరిగిన ఓపీ 2,06,194

ప్రజారోగ్యానికి వైఎస్సార్‌సీపీ సర్కార్ ఇస్తున్న ప్రాధాన్యతతో రోగులకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతోంది. ఒకప్పుడు సర్కార్ దవాఖానా అంటే హడలిపోయే రోగులు ఇప్పుడు ఆ వైఖరిని వీడి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పెద్ద సంఖ్యలో సేవలు పొందేందుకు ఆసక్తి చూపుతున్నారు. నాడు – నేడు వంటి పనులతో ఆస్పత్రుల రూపురేఖలు మారడమే కాకుండా అన్ని రకాల వైద్య సేవలు విస్తృత స్థాయిలో అందుతుండడంతో రోగులకు వీటిపై విశ్వాసం పెరిగింది. ఫలితంగా మంచిగా వైద్య సేవలు పొందుతున్నారు.



పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలో దంత వైద్య సేవలు అందిస్తున్న వైద్యురాలు

విజయనగరం ఫోర్ట్:

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన చర్యలతో వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో వైద్యసేవలు గణనీయంగా మెరుగుపడ్డాయి. ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించడంతో రోగులకు సకాలంలో వైద్య సేవలు అందుతున్నాయి. అన్ని రకాల సేవలు అందుతుండడంతో ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య గణనీయమంగా మెరుగుపడింది. ఓపీ, ఐపీతో పాటు శస్త్రచికిత్సలు అన్ని రకాల సేవలు పెరిగాయి. జిల్లాలో ఉన్న అన్ని సీహెచ్‌సీల్లోను సేవలు మెరుగుపడ్డాయి. 2021 – 22 సంవత్సరంతో పోలిస్తే 2022 – 23 సంవత్సరంలో ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య లక్షల్లో పెరిగింది.

2021 - 22, 22 - 23 సంవత్సరాల్లో అందించిన ఓపీ సేవలు

ఆస్పత్రి	2021–22	2022–23
జిల్లా ఆస్పత్రి, పార్వతీపురం	2,02,584	1,97,456
ప్రాంతీయ ఆస్పత్రి,ఎస్.కోట	86,254	1,03,742
గజపతినగరం(ఎ.హెచ్)	56,366	1,00,729
సీహెచ్‌సీ, బాడంగి	47,945	55,346
సీహెచ్‌సీ, భోగాపురం	48,179	60,786
సీహెచ్‌సీ, నెల్లిమర్ల	47,501	59,363
సీహెచ్‌సీ, చీపురుపల్లి	55,323	75,970
సీహెచ్‌సీ, బొబ్బిలి	68,368	83,189
సాలూరు (ఎ.హెచ్)	87,086	1,41,931
సీహెచ్‌సీ, కురుపాం	48,440	61,113
సీహెచ్‌సీ, భద్రగిరి	52,882	52,753
సీహెచ్‌సీ, చినమేరంగి	35,097	44,832

సౌకర్యాలు కల్పించిన ప్రభుత్వం

వైద్య విధాన్ పరిషత్ ఆస్పత్రుల్లో ప్రభుత్వం మౌలిక వసతలు కల్పించింది. ముఖ్యంగా ప్రతి సీహెచ్‌సీ, ప్రాంతీయ ఆస్పత్రిలో గైనికాలజిస్టు, పిడియాట్రిక్, అనస్తీషియా వైద్యులను, జనరల్ ఫిజీషియన్, డెర్మాటాలజీ, దంత, ఈఎన్‌టీ వైద్యులను నియమించింది. దీంతో అన్ని రకాల సేవలు అందుతున్నాయి. ఫలితంగా ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగింది. ప్రసవాలు, సిజేరియన్లు, ఇతర శస్త్రచికిత్సలు, వైద్య పరీక్షలు అల్ట్రాసౌండ్, ఈసీజీ వంటి సేవలు పెరిగాయి.

సీహెచ్‌సీల వివరాలు



బొబ్బిలి సామాజిక ఆరోగ్య కేంద్రం

జిల్లాలో ప్రాంతీయ సీహెచ్‌సీలు 12 ఉన్నాయి. వాటిలో పార్వతీపురం జిల్లా ఆస్పత్రి, ఎస్.కోట ప్రాంతీయ ఆస్పత్రి, గజపతినగరం ప్రాంతీయ ఆస్పత్రి, సీహెచ్‌సీ బాడంగి, సీహెచ్‌సీ భోగాపురం, సీహెచ్‌సీ నెల్లిమర్ల, సీహెచ్‌సీ చీపురుపల్లి, సీహెచ్‌సీ బొబ్బిలి, సీహెచ్‌సీ సాలూరు, సీహెచ్‌సీ కురుపాం, సీహెచ్‌సీ భద్రగిరి, సీహెచ్‌సీ చినమేరంగి ఆస్పత్రులు ఉన్నాయి.

ఆస్పత్రుల్లో సేవలు ఇలా..

2021 – 22 సంవత్సరంలో 12 సీహెచ్‌సీల్లో 8,31,016 మందికి ఓపీ సేవలు అందించారు. 95,800 మందికి ఇన్ పేషంట్ సేవలు అందించారు. మేజర్ శస్త్రచికిత్సలు 3,288 మందికి చేశారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు 1837 మందికి చేశారు. 8405 మందికి ప్రసవాలు నిర్వహించారు. ఎక్స్‌రే 37,416 మందికి తీశారు. అల్ట్రాసౌండ్ స్కాన్ 32,494 మందికి తీశారు. ఈసీజీ 15,974 మందికి తీశారు. వైద్య పరీక్షలు 6,60,417 మందికి చేశారు.

2022 – 23కి సంబంధించి 12 సీహెచ్‌సీల్లో 10,37,210 మందికి ఓపీ సేవలు అందించారు. 1,20,618 మందికి ఇన్‌పేషంట్ సేవలు అందించారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు 4,625 మందికి చేశారు. 8859 మందికి ప్రసవాలు నిర్వహించారు. ఎక్స్‌రే 57,045 మందికి, ఎక్స్‌రే 41,694 మందికి తీశారు. ఈసీజీ 27,293 మందికి, వైద్య పరీక్షలు 11,16,501 మందికి చేశారు.

మెరుగుపడిన సేవలు

జిల్లా ఆస్పత్రి, ప్రాంతీయ ఆస్పత్రి, సీహెచ్‌సీల్లో గణనీయంగా వైద్య సేవలు మెరుగుపడ్డాయి. మేజర్ ఆపరేషన్లు, ప్రసవాలు, సిజేరియన్లు, వైద్య పరీక్షలు పెరిగాయి. వైద్య సిబ్బంది కూడా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారు.

– డాక్టర్ బి.గౌరీశంకర్, డీసీహెచ్‌ఎస్

ఆకట్టుకున్న సంప్రదాయ వస్త్రధారణ పోటీలు



సంప్రదాయ వస్త్రధారణ పోటీల్లో పాల్గొన్న మహిళలు

విజయనగరం టౌన్: చేనేత కార్మికులను ఆదుకునేందుకు ఉత్తరాంధ్ర స్థాయిలో సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహిస్తున్నామని న్యూ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎం.నాగమల్లేశ్వరి తెలిపారు. ఆదివారం స్థానిక ఆనంద్ గ్రాండ్‌లో ఉత్తరాంధ్ర స్థాయి సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహించారు. సుమారు 50 మందికి పైగా యువతులు, మహిళలు వివిధ రకాల వేషధారణలతో అలరించారు. అనంతరం నాగమల్లేశ్వరి మాట్లాడుతూ, విశాఖలో ఆడిషన్స్ పూర్తి చేశామని, శ్రీకాకుళంలో చేయాల్సి ఉందన్నారు. చేనేత కార్మికుల అభ్యున్నతికి ఫౌండేషన్ కృషి చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ సురేష్‌నాయుడు, 2022 వస్త్రధారణ పోటీ విజేత భాగ్యలక్ష్మి, సభ్యులు సావిత్రి, వినోద్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

3న గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణానికి

సీఎం శంకుస్థాపన



సభా వేదిక పరిసర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక

- ముఖ్యమంత్రి సభాస్థలి ఖరారు
- ఏర్పాట్లు ముమ్మరం చేసిన జిల్లా యంత్రాంగం
- ఏర్పాట్లు పరిశీలించిన సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం
- పరిశీలనలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ, కలెక్టర్, ఎస్పీ

భోగాపురం:

భోగాపురంలో నిర్మించనున్న అంతర్జాతీయ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయ నిర్మాణానికి వచ్చే నెల మే 3వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా జరగనున్న శంకుస్థాపనకు, అనంతరం నిర్వహించే బహిరంగ సభకు సభాస్థలి ప్రదేశం ఖరారైంది. భోగాపురం మండలం ఎ.రావివలస, సవరవిల్లి గ్రామాల వద్ద విమానాశ్రయ నిర్మాణానికి సీఎం జగన్ శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం అక్కడ బహిరంగ సభను నిర్వహిస్తారు. ఇక్కడి నుంచే రూ.194 కోట్లతో తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టు పెండింగ్ పనులకు, చింతపల్లి జెట్టీ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ముఖ్యమంత్రి పాల్గొనే బహిరంగ సభ స్థలాన్ని సీఎం కార్యక్రమాల సమన్వయకర్త తలశిల రఘురాం, జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపిక పాటిల్ ఆదివారం ఉదయం పరిశీలించారు. సభా వేదిక, వీఐపీ గ్యాలరీ, పైలాన్, వాహనాలకు పార్కింగ్ తదితర అంశాలపై చర్చించి స్థలాలను ఖరారు చేశారు. హెలీప్యాడ్ కోసం బహిరంగ సభకు సుమారు 800 మీటర్ల దూరంలో రావివలస వద్ద నున్న ఖాళీ స్థలాన్ని పరిశీలించి ఆమోదించారు. ఈ పర్యటనలో జేసీ మయూర్ అశోక్, ఆర్అండ్‌బీ ఎస్ఈ జయశ్రీ, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ప్రత్యేకాధికారి జి.అప్పలనాయుడు, జీఎంఆర్ సీఈఓ మణ్మయ్, ప్రాజెక్టు మేనేజర్ రామరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఉప్పాడ సూర్యనారాయణరెడ్డి, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్రకు తలమానికం : జెడ్పీ చైర్మన్

భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు తలమానికమని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ మే 3వ తేదీన విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేయడం ద్వారా ఉత్తరాంధ్ర ప్రజల కలను సీఎం జగన్ నేరవేరుస్తున్నారని అన్నారు. ఇటీవలే శ్రీకాకుళం జిల్లాలో మూలపేట సీ పోర్టుకు సీఎం శంకుస్థాపన చేశారని, విశాఖపట్నం కార్యనిర్వాహక రాజధానిగా ప్రకటించారని, ఇప్పుడు జిల్లాలో ఎయిర్‌పోర్టు ఏర్పాటు చేయడం ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతగానో కృషి చేస్తున్నారని చెప్పారు. విమానాశ్రయం ఏర్పాటుతో ఈ ప్రాంత రూపురేఖలు మారిపోతాయని, ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎంతో మందికి ఉపాధి లభిస్తుందని చెప్పారు.

సభను విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే

వచ్చే నెల 3వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారని, కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు పాల్గొని సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పిలుపునిచ్చారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం కేవలం తమ నియోజకవర్గానికే కాకుండా ఉత్తరాంధ్ర జిల్లాలకే ఎంతో ప్రతిష్టాత్మకమని పేర్కొన్నారు. దాదాపు నాలుగేళ్ల పాటు తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసి డీ పట్టా రైతులకు జిరాయితీతో పాటు సమానంగా నష్ట పరిహారం చెల్లించి భూసేకరణను పూర్తి చేసిందన్నారు. నిర్వాసితులకు న్యాయం చేసి, వారికి పూర్తిగా పునరావాసం కల్పించిన తరువాతే శంకుస్థాపన చేస్తున్నామని చెప్పారు. ఇంకా ఏమైన సమస్యలు ఉంటే సీఎం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న తలశిల రఘురాం, జిల్లా పార్టీ అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే అప్పలనాయుడు తదితరులు

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

విజయనగరం అర్బన్: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటనకు సమన్వయంతో పటిష్ట ఏర్పాట్లు చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ ఆదేశించారు. మే 3న భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి సీఎం శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో పర్యటనా ఏర్పాట్లపై కలెక్టరేట్ ఆడిటోరియంలో ఆదివారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణాన్ని ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా భావిస్తోందన్నారు. ఎస్పీ దీపిక మాట్లాడుతూ ముఖ్యమంత్రి కార్యక్రమానికి పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేస్తామని చెప్పారు. జేసీ మయూర్ అశోక్, డీఆర్ఓ ఎం.గణపతిరావు, ఆర్డీఓ ఎంవీ సూర్యకళ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

- ఎంజేపీఏపీ బీసీ ఆర్‌జేసీ సెట్–2023కు దరఖాస్తుల ఆహ్వానం
- జూనియర్ ఇంటర్లో మూడు గ్రూపుల్లో 140 సీట్ల భర్తీకి ప్రకటన
- వచ్చేనెల 18 వరకు ఆన్‌లైన్లో దరఖాస్తుల స్వీకరణ
- విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల విద్యార్థులకు అవకాశం



నెల్లిమర్ల ఎంజేపీఏపీ బీసీ గురుకుల బాలికల కళాశాల

నెల్లిమర్ల:

పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే ఆర్‌జేసీ సెట్–2023కు ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలకు శిక్షణ అందించడమే లక్ష్యంగా విద్యార్థులకు ప్రవేశాలు కల్పించేందుకు సన్నద్ధమవుతోంది. నెల్లిమర్ల కళాశాలలో జూనియర్ ఇంటర్లో మూడు గ్రూపుల్లో మొత్తం 140 సీట్లు భర్తీ చేసేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. 2022–23 సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులు వచ్చే నెల 18వ తేదీ వరకు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకునే విద్యార్థినుల వయసు ఆగస్టు 31, 2023 నాటికి 17 సంవత్సరాలు మించకుండా ఉండాలి. వచ్చే నెల 28వ తేదీన ప్రవేశ పరీక్ష జరగనుంది. విజయనగరం, శ్రీకాకుళంతో పాటు పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులకు ఇదో చక్కని అవకాశం.

అందుబాటులోనున్న సీట్లు

నెల్లిమర్ల మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులున్నాయి. మొత్తం 140 సీట్లు అందుబాటులో ఉన్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎంపీసీ–60, బైపీసీ–40, సీఈసీ–40 చొప్పున సీట్లు భర్తీచేయనున్నారు. మే నెల 28వ తేదీన నిర్వహించే ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుంది. ఎంజేపీఏపీ బీసీ గురుకుల పాఠశాలల్లోనూ, బీసీ సంక్షేమ వసతిగృహాల్లోనూ చదివిన విద్యార్థినులకు ప్రవేశాల్లో ప్రాధాన్యత ఉంటుంది.

గురుకుల కళాశాలలో కల్పించే సౌకర్యాలివే

బీసీ గురుకుల కళాశాలలో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా సౌకర్యాలు కల్పిస్తారు. విద్యార్థినులకు ఇంగ్లిష్ మీడియంలో ఇంటర్మీడియెట్ విద్యను బోధిస్తారు. ఐఐటీ, నీట్ ప్రవేశ పరీక్షలకు లాంగ్ టర్మ్ కోచింగ్ అందిస్తారు. దీని కోసం నిపుణులైన అధ్యాపకులతో ప్రత్యేకంగా బోధన ఉంటుంది. వాటికి సంబంధించిన మెటీరియల్‌ను కూడా అందజేస్తారు. ఫీల్డ్ ట్రిప్స్, గెస్ట్ లెక్చర్స్ నిర్వహిస్తారు. ల్యాబ్, లైబ్రరీ సౌకర్యం అందుబాటులో ఉంది. ప్రతిరోజూ విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారు. క్రీడల్లో ప్రత్యేక శిక్షణ ఇస్తారు.

40 మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్



ఈ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిన 40 మంది విద్యార్థినులకు ఈ ఏడాది క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు లభించాయి. ఎంపీసీ గ్రూపునకు చెందిన 29 మంది, ఎంఈసీ గ్రూపునకు చెందిన 11 మంది హెచ్‌సీఎల్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలకు అర్హత సాధించారు. గతేడాది 19 మందికి ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలల్లో సీట్లు లభించాయి. ఒకరికి బీఎస్సీ నర్సింగ్‌లో సీటు వచ్చింది. ఈ కళాశాల నుంచి ఇప్పటికి నాలుగు బ్యాచ్‌లు రిలీవ్ కాగా, పరీక్షల్లో మొదటి, రెండవ బ్యాచ్‌లు శతశాతం, మూడవ బ్యాచ్ 99 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

ప్రవేశ పరీక్ష ఇలా..



ఎంజేపీఏపీ బీసీ ఆర్‌జేసీ సెట్ వంద మార్కులకు ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. ప్రశ్నలన్నీ పదోతరగతి సిలబస్‌పైనే ఉంటాయి. ఎంపీసీ గ్రూపునకు సంబంధించి గణితం 25, ఫిజిక్స్ 25, సోషల్ స్టడీస్ 15, ఇంగ్లిష్–20, లాజికల్ రీజనింగ్ 15 మార్కులకు ప్రశ్నలుంటాయి. బైపీసీ గ్రూపునకు సంబంధించి ఫిజికల్ సైన్స్ 25, బయోలాజికల్ సైన్స్ 25, సోషల్ స్టడీస్ 15, ఇంగ్లిష్ 20, లాజికల్ రీజనింగ్ 15 మార్కుల చొప్పున ప్రశ్నలు ఇస్తారు. సీఈసీ గ్రూపునకు సంబంధించి గణితం 30, సోషల్ స్టడీస్ 30, ఇంగ్లిష్ 25, లాజికల్ రీజనింగ్ 15 మార్కులకు ప్రశ్నలుంటాయి. పరీక్షలో మైనస్ మార్కుల విధానాన్ని అమలుచేస్తూ ఒక్కో తప్పుడు సమాధానానికి పావు మార్కు చొప్పున తీసివేస్తారు.

దరఖాస్తు చేసుకోవాలి



నెల్లిమర్ల మహాత్మా జ్యోతిబా పూలే బీసీ సంక్షేమ బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలి. ఈనెల 20నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. 2022–23 విద్యా సంవత్సరంలో పదోతరగతి పరీక్షలు రాసిన విద్యార్థినులు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు. వచ్చే నెల 28వ తేదీన నిర్వహించే ప్రవేశ పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా ప్రవేశాలు కేటాయిస్తాం. ఐఐటీ, నీట్ కోచింగ్‌కు సిద్ధపడే విద్యార్థినులకు మాత్రమే ఎంపీసీ, బైపీసీ గ్రూపుల్లో చేరే అవకాశముంది.

– డాక్టర్ కేటీవీ రావు,
గురుకుల కళాశాల ప్రిన్సిపాల్

క్లుప్తంగా

వావ్..ఎంత పెద్ద గుత్తో..!



కాయలతో వేలాడుతున్న మామిడి గుత్తి

నెల్లిమర్ల: ఎక్కడైనా మామిడి గుత్తికి ఐదో, పదో మామిడి కాయలు ఉంటాయి. అయితే ఈ గుత్తిలో మాత్రం ఏకంగా 22 కాయలున్నాయి. నెల్లిమర్ల పట్టణంలోని మండల పరిషత్ ప్రాంగణంలో ఉన్న ఓ మామిడి చెట్టుకు ఈ గుత్తి వేలాడుతూ సాక్షి కెమెరాకు చిక్కింది. ఇంత పెద్ద మామిడి గుత్తిని చూసి అందరూ ఆశ్చర్యపోతున్నారు.

సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుల నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

విజయనగరం: జిల్లా వ్యాప్తంగా ఉన్న సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుల జిల్లా కార్యవర్గ ఎన్నిక ఆదివారం ఏకగ్రీవంగా జరిగింది. విజయనగరంలో గల ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవనంలో జరిగిన ఎన్నిక ప్రక్రియను అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫారుక్ జాన్, ఉపాధ్యక్షుడు బి.శంకరరావులు పర్యవేక్షించారు. నూతన కార్యవర్గంలో అధ్యక్షుడిగా ఆర్.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా వి.మనోహర్, అసోసియేట్ అధ్యక్షుడిగా బి.తిరుపతిరావు, కోశాధికారిగా ఎన్.మధువర్ధన్‌లు ఎన్నికయ్యారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా ఆర్.సంగీత్, వై.సురేష్, బి.ఈశ్వరరావు, మహిళా కార్యదర్శులుగా ఎ.జానకి, గౌతమిలతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు చిన్నారావు

సీతంపేట: మండలంలోని మెట్టుగూడ సమీపంలో శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన చింతాడకు చెందిన సవర చిన్నారావు(27) రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై నీలకంఠరావు ఆదివారం తెలిపారు. మృతదేహానికి పాలకొండ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు. మృతుడికి భార్య గీత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మేస్త్రీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకువస్తున్న ఇంటి యజమానిని కోల్పోవడంతో భార్యాపిల్లలు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న అప్పలస్వామి

వీరఘట్టం: మండలంలోని సంత-నర్సిపురం గ్రామానికి చెందిన నారాయణపురం అప్పలస్వామి (50) అప్పుల బాధతో ఆదివారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై కిశోర్‌వర్మ తెలిపారు.గ్రామంలో కొందరికి డబ్బులు బాకీ ఉండడంతో భూమి అమ్మేసి అప్పులు తీర్చేద్దామని అనుకున్నాడు. అయితే కుటుంబసభ్యులు భూమి అమ్మేందుకు ఒప్పుకోకపోవడంతో మనస్తాపం చెంది తన టేకు తోటలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య గౌరమ్మ, కుమారుడు ఉపేంద్ర ఉన్నారు. కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై చెప్పారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 425.00
విజయనగరం	రూ. 429.00
శ్రీకాకుళం	రూ. 429.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,790-00
బంగారం(22సి. 10గ్రా.)	55,720-00
వెండి (కిలో)	80,400-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹117	₹204	₹ 214

వ్యాధుల అంతమే లక్ష్యం

- డిసెంబర్ నాటికి లేకుండా చేయాలని అధికారుల కృషి
- రెండేళ్ల లోపు పిల్లలకు రెండు దఫాలుగా వ్యాక్సిన్



మీజిల్స్ సోకిన రోగి

విజయనగరం ఫోర్ట్: పోలియో వ్యాధిని తరిమివేసినట్టే ప్రాణాంతకమైన మీజిల్స్ ,రూబెల్లా వ్యాధులను కూడా తరిమివేయడానికి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మేరకు 2023 డిసెంబర్ నాటికి ఈవ్యాధుల వ్యాప్తి లేకుండా చర్యలు చేపడుతోంది. రాష్ట్రంలోని రెండుజిల్లాల్లో ప్రస్తుతం మీజిల్స్, రూబెల్లా కేసులు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో అన్ని జిల్లాలోను ఈ వ్యాధులు లేకుండా చేయాలన్న లక్ష్యంతో పనిచేయాలని ప్రభుత్వం అధికార యంత్రాంగానికి ఆదేశాలు ఇచ్చింది. ఈ మేరకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

మీజిల్స్

మీజిల్స్ (తట్టు) వ్యాధిసోకిన వారికి జ్వరం ఉంటుంది. అదేవిధంగా ముందుగా చెవివెనుక దద్దుర్లు ప్రారంభమవుతాయి. క్రమేణా ఊపిరితిత్తులు, కళ్లు, మొదడుకు వస్తాయి. మెదడుకు వస్తే రోగి చనిపోయే ప్రమాదం ఉంది. ఒకకేసు నమోదైతే చుట్టుపక్కల వారికి అతి త్వరగా వ్యాప్తి చెందుతుంది. కేసుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. చిన్న పిల్లల నుంచి పెద్దవాళ్లకు కూడా వ్యాప్తి చెందుతుంది. జ్వరం, దద్దుర్లు ఉన్న పిల్లల నుంచి వైద్యాధికారులు శాంపిల్స్ సేకరించి విజయవాడలోని సిద్ధార్థ వైద్య కళాశాలలోని ల్యాబ్‌కు పరీక్ష నిమిత్తం పంపిస్తున్నారు. 2021లో 80 శాంపిల్స్ పంపించగా అన్నీ నెగిటివ్‌గా రిపోర్టు వచ్చాయి. అదేవిధంగా 2022లో15 శాంపిల్స్ పంపించగా అవి కూడా అన్నీ నెగిటివ్‌గా తేలింది.



రూబెల్లా సోకిన వ్యక్తి

రూబెల్లా:

ఈవ్యాధి ఉన్న మహిళలకు తరచూ గర్భస్రావం అవుతుంది. పుట్టే పిల్లలు బుద్ధి మాద్యంతో పుడతారు. పుట్టే పిల్లలకు కళ్లు కనిపించవు. గర్భం దాల్చిన 6,7 నెలలకే అబార్షన్ అవుతుంది. గర్భంలోనే రూబెల్లా వ్యాక్సిన్ శిశువును తినేస్తుంది.

వ్యాధులు ప్రబలకుండా టీకాలు

మీజిల్స్, రూబెల్లా వ్యాధులు ప్రబలకుండా ప్రభుత్వం పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయిస్తోంది. పుట్టిన పిల్లలకు 9 నెలలు నిండిన తర్వాత ఒకసారి, 16 నుంచి 18 నెలల లోపు మరోసారి టీకాలు వేస్తారు.

వ్యాధులు తరిమికొట్టాలి

మీజిల్స్, రూబెల్లా వ్యాధులను తరిమికొట్టి రాష్ట్రంలో లేకుండా చేయాలన్న సంకల్పంతో ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దానికి అనుగుణంగా చర్యలు చేపడుతున్నాం. జ్వరం, దద్దుర్లు ఉన్న పిల్లల శాంపిల్స్ తీసి పరీక్షలకు పంపిస్తున్నాం.
డాక్టర్ జగదీష్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి

గిరిజన ప్రాంత వాసులూ.. అప్రమత్తం



చీడిపాలెం గ్రామస్తులకు రక్షణ చర్యలపై అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ వేదవతి

బొండపల్లి: గిరిజన ప్రాంతంలోని ఆవుల మందపై పట్టపగలు పులి దాడి చేసి ఆవును చంపివేసినందున గిరిజన ప్రాంత వాసులంతా అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ ఎ.వేదవతి, కొత్త పాలెం ఫారెస్టు బీట్ ఆఫసర్ కె.వి.జగదీష్ ఆయా గ్రామాల గిరిజనులకు సూచించారు. మండలంలోని కొత్త పాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని చీడిపాలెం గ్రామంలో ఆవును పులి చంపివేసిన ప్రాంతాన్ని క్షేత్ర స్థాయిలో ఆదివారం వారు పరిశీలించారు. పులి దాడిలో మృతి చెందిన ఆవుకు శవ పంచనామా నిర్వహించారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన ప్రజలతో నేరుగా మాట్లాడడంతో పాటు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులి కదలికలపై నిఘా కెమెరాలను అటవీ ప్రాంతంలో పలు చోట్ల ఏర్పాటు చేసినట్లు చెప్పారు.కార్యక్రమంలో టైగర్ ట్రాకర్ అమర్, సహాయకులు చేతన్, అటవీశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పుస్తక పఠనమే జ్ఞానార్జనకు మార్గం



పుస్తక ప్రదర్శనను ప్రారంభించిన జిల్లా కేంద్ర గ్రంథాలయ కార్యదర్శి ఎస్.లలిత

- ఘనంగా ప్రపంచ పుస్తక దినోత్సవం

విజయనగరం అర్బన్: జ్ఞానార్జనకు పుస్తక పఠనమే ప్రధాన మార్గమని దాన్ని యువత వినియోగించుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్.లలిత అన్నారు. పట్టణంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ప్రపంచ పుస్తక దినోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పుస్తకం చదవడం ద్వారా మానసిక ఉల్లాసం, ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు. రచయితలు, పబ్లిషర్స్, పుస్తకాల ఆవశ్యకతను యునెస్కో 1955లో ఏప్రిల్ 23వ తారీఖున ప్రపంచ పుస్తక దినోత్సవంగా గుర్తించిందన్నారు. అనంతరం గ్రంథాలయంలోని పాఠకులకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ ఉప అధికారి బి.లక్ష్మి, గ్రంథాలయ సిబ్బంది పాఠకులు పాల్గొన్నారు.

14 పంచాయతీలకు ఉత్తమ అవార్డులు

- డీపీఓ బలివాడ సత్యనారాయణ

పార్వతీపురం టౌన్: వివిధ విభాగాల్లో ఉత్తమ గ్రామ పంచాయతీలను రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. అందులో పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన 14 గ్రామ పంచాయతీలు వివిధ విభాగాల్లో ర్యాంకులు దక్కించుకున్నాయని జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. మొత్తం తొమ్మిది విభాగాలలో ర్యాంకులు ప్రకటించారని ఆయన చెప్పారు. ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ఈ ర్యాంకులు ప్రకటించారని ఆయన పేర్కొన్నారు.

అవార్డులు పొందిన పంచాయతీలివే

- పేదరికంలేని, మెరుగైన జీవనోపాధుల గ్రామం విభాగం(థీమ్ 1)లో పార్వతీపురం మండలం చిన బొండపల్లి గ్రామపంచాయతీకి రెండవ ర్యాంక్ దక్కింది.
- ఆరోగ్యవంతమైన గ్రామ పంచాయతీగా విభాగం (థీమ్ 2)లో గుమ్మలక్ష్మీపురం మండలం గుమ్మలక్ష్మీపురం గ్రామ పంచాయతీకి మొదటి ర్యాంక్ లభించింది.
- నీటి సమృద్ధి గల గ్రామం విభాగం(థీమ్ 4)లో పాలకొండ మండలం వెలగవాడ గ్రామ పంచాయతీ, సీతానగరం మండలం జోగింపేట గ్రామ పంచాయతీకి మొదటి ర్యాంక్ లభించింది.
- పరిశుభ్రమైన హరిత గ్రామం విభాగం (థీమ్5)లో సీతానగరం మండలం జోగింపేట గ్రామ పంచాయతీకి మూడవ ర్యాంక్ లభించింది.
- స్వయం సమృద్ధి ఉన్న మౌలిక సదుపాయాలు కలిగిన గ్రామం విభాగం (థీమ్ 6)లో కురుపాం మండలం పెద్ద సొత్తిలి గ్రామ పంచాయతీకి మొదటి ర్యాంక్, గురుగుబిల్లి మండలం గురుగుబిల్లికి రెండవ ర్యాంక్ దక్కింది.
- సామాజికంగా సురక్షితమైన గ్రామం విభాగం (థీమ్ 7) లో గరుగుబిల్లి మండలం కొత్తపల్లి మొదటి ర్యాంక్ దక్కించుకుంది.
- సుపరిపాలన కలిగిన గ్రామం విభాగం (థీమ్ 8)లో బలిజిపేట మండలం మిర్తివలస గ్రామ పంచాయతీకి మొదటి ర్యాంక్, సీతానగరం మండలం జోగింపేట గ్రామ పంచాయతీ రెండవ ర్యాంక్, బలిజిపేట మండలం పెదపెంకి గ్రామ పంచాయతీకి మూడవ ర్యాంక్ లభించింది.
- లింగ సమానత్వంతో మరింతగా గ్రామాభివృద్ధి విభాగం (థీమ్ 9)లో సీతానగరం మండలం జేఎం వలస గ్రామపంచాయతీ రెండవ ర్యాంక్, సీతానగరం మండలం దయానిధిపురం గ్రామపంచాయతీ, సీతంపేట మండలం సీతంపేట గ్రామపంచాయతీ మూడవ ర్యాంక్ దక్కించుకున్నాయి.

కలెక్టర్ అభినందనలు

14 గ్రామ పంచాయతీలు ర్యాంకులు సాధించడం పట్ల కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆయా పంచాయతీల పాలకులను అభినందించారు. రానున్న రోజుల్లో మరిన్ని ఎక్కువ పంచాయతీలు ర్యాంకులు సాధించి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శంగా నిలపాలని ఆయన కోరారు. అంకితభావంతో మంచి సేవలు అందిస్తే కచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు.

భూ వివాదంలో అన్నకు గాయాలు



చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

బలిజిపేట: మండలంలోని నారాయణపురంలో అన్నదమ్ముల మధ్య తలెత్తిన భూవివాదంలో అన్న తీవ్ర గాయాల పాలయ్యాడు. గ్రామస్తుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన అన్నదమ్ములు జి.వెంకటరమణ, రామినాయుడుల మధ్య భూ వివాదం తలెత్తింది. ఈ వివాదంలో తమ్ముడు రామినాయుడు, అన్న వెంకటరమణ తలపై గనపంతఊడ బలంగా కొట్టడంతో గాయాలయ్యాయి. వెంటనే బొబ్బిలి సీహెచ్‌సీకి తరలించడంతో అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం విజయనగరం తరలించారు. దీనిపై బలిజిపేట పోలీసులకు సమాచారం తెలియడంతో దర్యాప్తు నిర్వహించి కేసు నమోదు చేయనున్నట్టు ఎస్సై ప్రశాంత్‌కుమార్ తెలిపారు.

గోవుల అక్రమ తరలింపు అడ్డగింత



పోలీసులకు గ్రామస్తులు పట్టించిన గోవులు

భామిని: మండలం గుండా జరుగుతున్న పాడిపశువుల అక్రమ తరలింపును ఘనసర గ్రామస్తులు అడ్డుకున్నారు. మూడు రోజులుగా బొలెరో వాహనాల్లో కాళ్లు కట్టిన ఆవులపై టార్పాలిన్లు కప్పి కీసర మీదుగా వంశధార నదీ తీరం వెంబడి అక్రమంగా తరలిస్తున్నారని ఘనసర గ్రామస్తులు గుర్తించారు. యథావిధిగా ఆదివారం వచ్చిన మూడు వాహనాలను ఆపి తనిఖీ చేసి గోవులను తరలిస్తున్నట్లు గుర్తించి అడ్డుకుని పోలీసులకు పట్టించారు. దీనిపై బత్తిలి ఎస్సై వై.అమ్మన్‌రావు మాట్లాడుతూ ఘనసర నుంచి కీసర వైపు మూడు బొలెరో వాహనాల్లో తరలిస్తున్న 21 గోవులను గ్రామస్తుల సమాచారం మేరకు పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు. పట్టుకున్న గోవులను విశాఖ గోశాలకు తరలించినట్లు వివరించారు.

తల్లీకూతుళ్లకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రమణమ్మ



104లో క్షతగాత్రులను తరలిస్తున్న దృశ్యం

పార్వతీపురం/బలిజిపేట: భార్య పై అనుమానంతో భర్త దాడిచేయడంతో భార్యతో పాటు కూతురికి గాయాలయ్యాయి. శనివారం రాత్రి జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం జిల్లా ఆస్పత్రి అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. బలిజపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన సింగారపు రమణమ్మకు సింగారాపు శ్రీనుతో పెళ్లయి 21సంవత్సరాలు అయింది. ఇద్దరు పిల్లలు. కుమార్తె పుట్టినప్పటి నుంచి భార్యపై భర్త అనుమానం పెట్టుకున్నాడు. ఈ అమ్మాయి తనకు పుట్టలేదని అక్రమ సంతానమని అనుమానిస్తున్నాడు. ఈ అనుమానంతో తరచూ తిడుతూ, కొడుతూ ఉన్నాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి 9 గంటల ప్రాంతంలో ఇంట్లో మంచంపై కుమార్తె స్నేహతో కలిసి రమణమ్మ నిద్రిస్తుండగా భర్త శ్రీను వచ్చి మంచం దండితో వెంటబడి మరీ కొట్టాడు. అడ్డువచ్చిన కూతురు స్నేహను కూడా కొట్టాడు. ఈసంఘటనలో తల్లికూతుళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఇద్దరినీ బలిజిపేట పీహెచ్‌సీకి తీసుకు వెళ్లగా ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి 108 వాహనం ద్వారా తరలించారు. వైద్యులు చికిత్స అందించారు.

లారీ చక్రం ఊడి ముగ్గురు మహిళలకు...

బొబ్బిలి: రామభద్రపురం–బొబ్బిలి మధ్య వెళ్తున్న ఓ లారీ చక్రం ఊడిపోవడంతో ముగ్గురు మహిళలు గాయపడ్డారు. గొర్లె సీతారామపురం వద్ద జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గొర్లె సీతారాంపురం గ్రామానికి చెందిన ఏగిరెడ్డి అప్పలనర్సమ్మ, గొర్లె అప్పలనర్సమ్మ, గొర్లె రమణమ్మలు రోడ్డు పక్కన వద్ద కానాపై కూర్చున్నారు. ఆ సమయంలో వెళ్తున్న లారీ చక్రం ఊడిపోయి దొర్లుకుంటూ వీరిని రాసుకుని వెళ్లిపోయింది. దీంతో వారికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే 108లో సీహెచ్‌సీకి తరలించిన లారీ ఓనర్ క్షతగాత్రులకు వైద్య చికిత్సలు చేసి వారిని తిరిగి ఇళ్లకు పంపించే ఏర్పాటు చేశారు.

అమ్మవార్లకు ప్రత్యేకపూజలు



ఎంపీ బెల్లాన చంద్రశేఖర్



పెదమంత్రిపేట వనం వద్ద ఉన్న అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తున్న జెడ్పీచైర్మన్ మజ్జిశ్రీనివాసరావు

మెరకముడిదాం: మండలంలోని పెదమంత్రిపేటలో వనం వద్ద వెలసిన తాడమ్మతల్లి, బంగారమ్మతల్లికి జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జిశ్రీనివాసరావు, విజయనగరం ఎంపీ బెల్లానచంద్రశేఖర్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవార్ల విశిష్టతను కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు నిరంతరం సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లేటట్టు అమ్మవార్లు దీవెనలు అందించాలని కోరుకున్నారు. అనంతరం జెడ్పీచైర్మన్ శ్రీనివాసరావు, ఎంపీ బెల్లాన గర్భాంలో సిరిమానోత్సవానికి జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఎస్‌వీ రమణరాజు, తాడ్డివేణుగోపాలరావు, కోట్లవిశ్వేశ్వరరావు, తాడిసత్యంనాయుడు, తాడ్డిచంద్రశేఖర్, రైల్వేబోర్డుమెంబరు తాడేల ఉమావెంకట మహేశ్వరరావు, తాడేల షన్ముఖరావు, పప్పలకృష్ణమూర్తి, కర్రోతునాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుర్తుపట్టిందని..ప్రాణం తీశాడు

- బంగారు ఆభరణాలు దోచుకుని పరారీ
- వివరాలు వెల్లడించిన ఎస్పీ ఎం.దీపిక



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ ఎం.దీపిక (వెనుక ముసుగులో నిందితుడు)

విజయనగరం క్రైమ్: ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడాలనే ఉద్దేశంతో చెడు మార్గాన్ని ఎంచుకుని, చివరకు సొంత పెద్దమ్మనే హత్యచేశాడో ప్రబుద్ధుడు. ఆమె వద్దనుంచి బంగారు ఆభరణాలు తీసుకుని విశాఖలోని గోల్డ్‌లోన్ కంపెనీలో తాకట్టుపెట్టాడు. సాంకేతిక ఆధారాలతో పోలీసులు నిఘా పెట్టడంతో ఎట్టకేలకు పట్టుబడ్డాడు. ఈ కేసుకు సంబంధించి ఎస్పీ ఎం.దీపిక ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ఎల్.కోట మండలం జమ్మాదేవిపేటకు చెందిన మాదాబత్తుల కృష్ణ తన దగ్గర బంధువు (పెద్దమ్మ) ఇంట్లో చోరీకి ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. ఈ నెల 15న కొత్తవలస కుమ్మరివీధిలో ఉన్న పెద్దమ్మ మాదాబత్తుల సూర్యకాంతం ఇంటికి వెళ్లాడు. ఇంట్లో కుటుంబసభ్యులెవరూ లేకపోవడంతో ఆమె మెడలో ఉన్న రెండుపేటల బంగారు పుస్తెల తాడును తెంపేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె ప్రతిఘటించి, అతని ముఖానికి ఉన్న కర్చీఫ్‌ను తొలగించి, బంధువు మాదాబత్తుల కృష్ణ (వరసకు కుమారుడిగా) గుర్తించింది. ఎందుకు ఈ దుర్మార్గానికి పాల్పడుతున్నావని, పెనుగులాడుతుండగా, నిందితుడు కృష్ణ ఆమెను వంట గదిలో ఉన్న కత్తిపీటతో తలపైన విచక్షణారహితంగా కొట్టడంతో రక్తపు మడుగులో పడిపోయింది. సంఘటనా స్థలంలో ఆనవాళ్లు లేకుండా, పోలీసు జాగిలాలు నిందితుడి ఆచూకీని గుర్తించకుండా ఉండేందుకు వంటగదిలో కారం తీసి, సంఘటనా స్థలంలో జల్లి, రక్తపు మడుగులో పడిపోయిన సూర్యకాంతం మెడలోని పుస్తెల తాడును, ఒక చెవికి గల ఎత్తు గొలుసును కృష్ణ తీసుకుని అక్కడినుంచి పరారయ్యాడు. విశాఖలోని గోపాలపట్నం అటికా గోల్డ్ లోన్ సంస్థలో తన ఆధార్ కార్డ్‌ను గుర్తింపుగా ఇచ్చి దోచుకున్న బంగారాన్ని తాకట్టు పెట్టాడు. అతని బ్యాంక్ అకౌంట్‌కు రూ.లక్షా 48 వేలు జమయ్యాయి. భార్యాపిల్లలతో అత్తవారింటికి వెళ్లి అక్కడి నుంచి విజయవాడ వెళ్లి తలనీలాలు సమర్పించి, అమ్మవారిని దర్శించుకుని, భార్యాపిల్లలను అత్తవారింటివద్ద వదిలేసి కూలిపనుల నిమిత్తం కర్నాటక రాష్ట్రంలోని కొప్పల్‌కి వెళ్లిపోయాడు. అయితే నిందితుడి భార్య ఫోన్ చేసి, మాదాబత్తుల సూర్యకాంతాన్ని చికిత్స నిమిత్తం కేజీహెచ్‌లో చేర్చగా చనిపోయిందని, పిల్లలకు ఆరోగ్యం బాగోలేదని, రమ్మనమని కోరడంతో ఎల్.కోట మండలం జమ్మాదేవిపేట రాగా పోలీసులు అరెస్టు చేశారు.

పోలీస్ సిబ్బందికి అభినందనలు

కేసులో క్రియాశీలక పాత్ర పోషించిన కొత్తవలస సీఐ ఎస్.బాలసూర్యారావు, సీసీఎస్ సీఐ ఎం.బుచ్చిరాజు, సాంకేతిక ఆధారాలు సేకరించి, హత్యకు పాల్పడిన నిందితుడిని గుర్తించి అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసుకు సంబంధించి సీఐలు ఎస్.బాలసూర్యారావు, ఎం.బుచ్చిరాజు, ఎస్సైలు వైవీ.జనార్దన్, హేమంత్ కుమార్, సాగర్ బాబు, సీసీఎస్ పోలీసులను ఎస్పీ అభినందించి, ప్రశంసపత్రాలను అందజేశారు. సమావేశంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, కొత్తవలస సీఐ ఎస్.బాలసూర్యారావు, ఎస్బీ సీఐ జి.రాంబాబు, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.